సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం । 23 । ఆగస్టు । 2023

న్యూస్‌రీల్

కొమ్మినేని పర్యటన నేడు


కొమ్మినేని శ్రీనివాసరావు

సాక్షి, పాడేరు: సీఆర్ మీడియా అకాడమి చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు రెండు రోజుల పాటు ఏజెన్సీలో పర్యటించనున్నారు. ఈనెల 23వ తేదీ బుధవారం ఉదయం విశాఖపట్నంలో బయలు దేరి 10.30 గంటలకు పాడేరు చేరుకుంటారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో అవర్ స్టేట్ అవర్ లీడర్ మేధావుల సంఘం ఏర్పాటు చేసిన సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై నిర్వహించనున్న ప్రత్యేక సదస్సులో ఆయన పాల్గొంటారు. మధ్యాహ్నం రెండు గంటలకు కాఫీ అతిథి గృహానికి చేరుకుని రాత్రికి కూడా అక్కడే బస చేస్తారు. 24వతేదీ ఉదయం 9గంటలకు పాడేరు నుంచి బయలుదేరి అనంతగిరి మండలంలోని బొర్రాగుహలను సందర్శిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు అరకులోయ చేరుకుంటారు. మధ్యాహ్నం భోజనం అనంతరం అనంతగిరి వెళ్తారు. రాత్రికి అక్కడే అక్కడే బస చేసి మరుసటి రోజు ఉదయాన్నే ఎస్.కోట మీదుగా రాజమహేంద్రవరం వెళ్తారు.

డ్రాపౌట్స్‌పై దృష్టి పెట్టండి


విద్యార్థులతో మాట్లాడుతున్న సౌరభ్‌గౌర్

అనంతగిరి: డ్రాపౌట్స్ లేకుండా చూడాలని ఇంటర్మీడియట్ బోర్డు ఎడ్యుకేషన్ కమిషనర్ సౌరభ్ గౌర్ ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ముందుగా తరగతి గదిలోని విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డ్రాపౌట్ విద్యార్థులను గుర్తించి, మళ్లీ కళాశాలలో చేర్పించాలని సూచించారు. చదువుతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలోని ప్రిన్సిపాల్ అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

కారులో తరలిస్తున్న గంజాయి స్వాధీనం

మోతుగూడెం : మోతుగూడెం పోలీస్ స్టేషన్ చెక్‌పోస్టు వద్ద మంగళవారం నిర్వహించిన తనిఖీలో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. చింతూరు సీఐ అప్పలనాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మోతుగూడెం పోలీస్ చెక్‌పోస్టు వద్ద ముందస్తు సమాచారం మేరకు కేరళకు చెందిన ఒక వాహనంతో పాటు మూడు ద్విచక్ర వాహనాలను ఆపి తనిఖీ చేయగా కారులో 60 కేజీల గంజాయి లభ్యమైంది. ఈ కేసులో మొత్తం ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. కేరళకు చెందిన మోహన్‌దాస్ ఒడిశా ప్రాంతానికి చెందిన సుధీర్ నుంచి గంజాయి కొనుగోలు చేసి కేరళకు తీసుకువెళుతుండగా పట్టుబడ్డారని సీఐ తెలిపారు. గతంలో మూడు సార్లు గంజాయిని తీసుకుని వెళ్లాడన్నారు. ఈ కేసులో కేరళకు చెందిన ఎస్.ఎస్.మోహన్‌దాస్, సెల్వరాజ్, విష్ణు, నిషాద్, ఒడిశాకు చెందిన సుధీర్, నీలికాంత్, రమేష్‌తో పాటు మరో వ్యక్తి ఉన్నట్టు తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.3 లక్షలు ఉంటుందని, ఒక కారు, మూడు మోటర్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితులను రంపచోడవరం కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

ఏయూతో కెనడా సంస్థ ఎంవోయూ


ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ప్రతినిధులు

ఏయూక్యాంపస్ (విశాఖ): ఆంధ్రవిశ్వవిద్యాలయంతో కెనడాకు చెందిన ఆరెంజ్ న్యూరో సైన్సెస్ సంస్థ అవగాహన ఒప్పందం చేసుకుంది. మంగళవారం ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాలపై ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఆరెంజ్ న్యూరోసైన్సెస్ సంస్థ సీఈవో డాక్టర్ వినయ్ సింఘులు సంతకాలు చేశారు. కార్యక్రమంలో ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాస రావు, సైకాలజీ విభాగాధిపతి ఆచార్య ఎం.వి.ఆర్ రాజు, అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్ ఎం.జేమ్స్ స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు. అవగాహన ఒప్పందంలో భాగంగా డిజిటల్ థెరపీ సెంటర్ ఏర్పాటు చేయడం, పరిశోధకులకు ఉచిత శిక్షణ అందించడం, రూ.10 లక్షలు విలువైన థెరపీ లైసెన్స్ ఏయూకు అందించనుంది. రెండు సంస్థలు సంయుక్తంగా విద్య, బోధన, పరిశోధన సంబంధ అంశాలలో కలసి పనిచేయాలని నిర్ణయించారు.

మన్యం సమస్యలపై సమగ్ర చర్చ

- రోడ్లకు సత్వరమే మరమ్మతులు
- చెట్ల కొమ్మల తొలగింపునకు చర్యలు
- నాణ్యత పరిశీలన అనంతరం రాజ్‌మా విత్తనాల పంపిణీ
- జెడ్పీ సమావేశానికి హాజరైన మంత్రులు బూడి, గుడివాడ



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, వేదికపై మంత్రి గుడివాడ అమర్‌నాథ్, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, హాజరైన సభ్యులు

సాక్షి, విశాఖపట్నం: స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీలో సమస్యలపై సమగ్రంగా చర్చించారు. వీటికి సంబంధిత అధికారులు సమాధానాలిచ్చారు. మంగళవారం జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. రోడ్లు, భవనాలు, వ్యవసాయం, వైద్యం, ఆరోగ్యం, జలవనరుల శాఖ తదితర శాఖలకు సంబంధించి సభ్యులు పలు విషయాలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల కలెక్టర్లు ఎ.మల్లికార్జున, రవి పట్టాన్‌శెట్టి, సుమిత్‌కుమార్ హాజరయ్యారు.

రోడ్లు భవనాల శాఖపై..

తొలుత రోడ్లు భవనాల శాఖపై చర్చ జరిగింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో రోడ్లను మెరుగుపరచాలని, రోడ్ల వెంబడి చెట్ల కొమ్మలు పెరిగిపోయి వాహనాలకు ఇబ్బందికరంగా మారాయని, ఇటీవల ఘాట్‌రోడ్డులో జరిగిన బస్సు ప్రమాదానికి చెట్ల కొమ్మలు కారణమయ్యాయని అనంతగిరి, చింతపల్లి, అరకు జెడ్పీటీసీలు గంగరాజు, పోతరాజు, రోషిణి తెలిపారు. దీనిపై ఆర్అండ్‌బీ అధికారులు సమాధానమిస్తూ రోడ్ల మరమ్మతులు చేపడతామని, చెట్ల కొమ్మలు తొలగిస్తామని చెప్పారు.

రాజ్‌మా విత్తనాల పంపిణీకి చర్యలు

వ్యవసాయశాఖపై జరిగిన చర్చలో ఏజెన్సీలో రాజ్‌మా విత్తనాల పంపిణీ ఆలస్యమవుతోందని ఆ ప్రాంత సభ్యులు చెప్పడంతో స్పందించిన అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్.. ప్రస్తుతం ఈ విత్తనాల నాణ్యత పరిశీలన జరుగుతోందని వారంలో పంపిణీ చేస్తామన్నారు. అల్లూరి జిల్లాలో కొండపోడు సాగుకు ట్రాక్టర్లు పనికిరావని, అందువల్ల ఎద్దులను ఇవ్వాలని, పీటీజీలకు నెలకు 50 కిలోల బియ్యాన్ని ఉచితంగా ఇవ్వాలని కొయ్యూరు జెడ్పీటీసీ నూకరాజు కోరారు. డీఫారం పట్టా భూములకు రుణాలివ్వడం, రెన్యువల చేయడం లేదని కొందరు జెడ్పీటీసీలు ఫిర్యాదు చేశారు. దీనిపై అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి పరిశీలించి చర్యలు తీసుకుంటానని చెప్పారు.

'ఆ భూములు గిరిజనులకు ఇప్పించాలి'

ఏడెనిమిదేళ్ల క్రితం అనంతగిరి మండలంలోని ఐదు గ్రామాల్లో 325 ఎకరాల గిరిజనుల భూములను గిరిజ నేతరులు బినామీల పేరిట అక్రమంగా కొనుగోలు చేశారని తిరిగి ఆ భూములు గిరిజనులకు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని అక్కడ జెడ్పీటీసీ గంగరాజు కోరారు. వైద్యారోగ్య శాఖపై జరిగిన చర్చలో సదరం సర్టిఫికెట్ల జారీలో వైకల్య పర్సంటేజీలో తాత్కాలికం అని పేర్కొనడం వల్ల పలువురు దివ్యాంగులు పెన్షన్లకు నోచుకోవడం లేదని సభ్యులు సభలో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని అనకాపల్లి కలెక్టర్ తెలిపారు.

కేజీహెచ్ వైద్య సేవలపై విచారణ..

అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం చిన గుమ్ములూరులో ఈనెల 17న పురుగుల మందు తాగిన అనంత్ అనే యువకుడిని కేజీహెచ్‌కు తరలిస్తే వైద్యులు సరైన వైద్యం చేయలేదని, దీంతో ప్రైవేటు ఆస్పత్రిలో చేరిస్తే చనిపోయాడని అక్కడ జెడ్పీటీసీ కాకర దేవి ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్‌ను ఆదేశించారు. సమావేశంలో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీ సీఈవో శ్రీరామ్మూర్తి, డీఎఫ్‌వో అనంత శంకర్, అధికారులు పాల్గొన్నారు.

మౌలిక వసతులకు ప్రాధాన్యం

ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు

సాక్షి, విశాఖపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లాలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు తెలిపారు. మంగళవారం జెడ్పీ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఒక్కో రంగంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రణాళికాబద్ధంగా ప్రగతిని సాధిస్తున్నామని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితుల వల్ల వరినాట్లు ఆలస్యమవుతున్నాయని, రైతులు నష్టపోకుండా రిజర్వాయర్ల దిగువ సాగు భూములకు నీటిని విడుదల చేస్తామని తెలిపారు. ప్రతి గ్రామంలోనూ వైద్య సేవలు, టెలిమెడిసిన్, ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు సక్రమంగా అందుతున్నాయన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో 14 రకాల వైద్య పరీక్షలు, 105 రకాల మందులను అందుబాటులో ఉంచామన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర మాట్లాడుతూ చింతపల్లి, కొయ్యూరు, జీకే వీధి మండలాల ప్రజలకోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో ఎస్టీ సెల్ ఏర్పాటుకు తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. అనంతగిరి నుంచి కేజీహెచ్‌కు నేరుగా రోగులను తీసుకొచ్చేందుకు అంబులెన్స్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

కలెక్టర్ల పనితీరు భేష్!

ప్రశంసించిన సభ్యులు

సాక్షి, విశాఖపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లాలోని ముగ్గురు కలెక్టర్ల పనితీరు బాగుందని జెడ్పీటీసీలు, ఎంపీపీలు కొనియాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాల అమలులో చిత్తశుద్ధితో పనిచేస్తున్నారన్నారు. మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో వీరు విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల కలెక్టర్లపై ప్రసంశల జల్లు కురిపించారు. తాము ప్రజా సమస్యలపై కలెక్టర్లకు ఫోన్ చేసినా, నేరుగా సంప్రదించినా సత్వరం స్పందిస్తున్నారని వారు పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడడంతో పాటు అవకతవకలకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా కృషి చేస్తున్నారన్నారు. సీఎం జగన్ ప్రజా రంజక పాలనకనుగుణంగా వీరు కూడా ఉత్తమ సేవలందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని వారు పేర్కొన్నారు.

25న అరకు ఐటీఐలో జాబ్‌మేళా

- జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ప్రశాంత్‌కుమార్
- పోస్టర్ ఆవిష్కరించిన చెట్టి వినయ్


జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చెట్టి వినయ్, ప్రశాంత్‌కుమార్

సాక్షి,పాడేరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 25న అరకులోయ ప్రభుత్వ ఐటీఐలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ప్రశాంత్‌కుమార్ కోరారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ 18 నుంచి 30ఏళ్ల లోపు ఇంటర్, డిప్లమో, డిగ్రీ, బిటెక్ చదువుకున్నవారంతా జాబ్‌మేళాలో పాల్గొనేందుకు అర్హులన్నారు. నిరుద్యోగ అభ్యర్థులంతా తమ బయోడేటా,విద్యార్హత,ఇతర ధ్రువ పత్రాలు,ఆధార్ కార్డు జెరాక్స్ కాపీలతో నేరుగా జాబ్ మేళాకు హాజరు కావాలని ఆయన కోరారు. పలు కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాల భర్తీకి ఈ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 9491786463, 6304634447 నంబర్ల సంప్రదించాలని ఆయన కోరారు.

జి.మాడుగులలో భారీ వర్షం

జి.మాడుగుల: మండలంలో పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. దీంతో రహదారులు జలమయమయ్యాయి. పంటపొలాల్లో వర్షం నీరు చేరింది. పాడేరు – జి.మాడుగుల, చింతపల్లి, నుర్మతి, మద్దిగరువు, సొలభం,గడుతూరు, వంజరి, తాజంగి రోడ్డు మార్గాలో వర్షం నీటి వల్ల వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు.

డిసెంబర్ నాటికి భూరీసర్వే పూర్తి

- ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఆదేశం
- తహసీల్దార్లు, మండల సర్వేయర్లతో వీడియో కాన్ఫరెన్సు


వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: జగనన్న భుహక్కు, భూరక్ష కార్యక్రమంలో ప్రభుత్వ ,ప్రైవేట్ భూముల రీసర్వే నిర్దేశించిన ప్రకారం పూర్తి చేయాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జగనన్న భూహక్కు, భూ రక్ష కార్యక్రమంపై మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, మండల సర్వేయర్లకు ఆయన పలు సూచనలిచ్చారు. ఏజెన్సీలోని ఏడు మండలాల్లో భూహక్కు భూరక్ష పథకంలో ఇప్పటివరకు చేపట్టిన రీసర్వే వివరాలను ఆయన తెలుసుకున్నారు. డిసెంబర్ నాటికి ఏజెన్సీలో రీసర్వే పూర్తికి అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు. దీనిలో భాగంగానే ప్రతి మండలంలో సర్వే బృందానికి విధించిన లక్ష్యం మేర సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో రీసర్వేకు సంబంధించిన వివరాలను ముందుగా వీఆర్వో లాగిన్‌లో పొందుపరచాలని సూచించారు. రీ సర్వేకు సంబంధించిన వివరాలను ముందుగా వీఆర్వో లాగిన్‌లో పొందుపరచాలని సూచించారు. ప్రతి మండలంలోని సర్వే బృందాలు ఉదయం ఏడు గంటల లోపు క్షేత్రస్థాయి సర్వే చేసేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. సర్వే చేసిన రైతులకు రైతులకు నోటీసులు ఇచ్చి, సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. రైతులు సంతృప్తి చెందిన తరువాత పూర్తి వివరాలు అప్లోడ్ చేయాలని సూచించారు. ఏజెన్సీ ఏడు మండలాల్లో రీసర్వేకు సంబంధించి ఇప్పటివరకు 253 గ్రామాల్లో ఫీల్డ్ వర్క్ పూర్తయిందన్నారు. రీ సర్వే చేసేందుకు ముందుగా రైతులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్వే అధికారులు కె. దేవేంద్రుడు, భీమశంకర్. సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవో మడకం సావిత్రి, డీటీ కె. సుధాకర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

క్రేన్ సాయంతో బయటకు ఆర్టీసీ బస్సు


పాడేరు ఘాట్ మార్గంలో లోయలో నుంచి ఆర్టీసీ బస్సును బయటకు తీస్తున్న క్రేన్


బస్సు తీసే సమయంలో ఘాట్‌లో నిలిచిన వాహనాలు

శ్రమించిన అధికార యంత్రాంగం

సాక్షి,పాడేరు: ఘాట్‌రోడ్డులో ఆదివారం మధ్యాహ్నం లోయలోకి దూసుకుపోయి ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సును ఎట్టకేలకు మంగళవారం సాయంత్రం బయటకు తీశారు. సోమవారం వర్షం కారణంగా పరిస్థితులు అనుకూలించలేదు. మంగళవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి క్రేన్ సాయంతో లోయలో బస్సును బయటకు తీసే పనులు చేపట్టారు. ఆర్టీసీ, ఆర్అండ్‌బీ, అగ్నిమాపక సిబ్బందితో పాటు గోవాడ నుంచి వచ్చిన కూలీలంతా బస్సుకు రోప్‌ను అమర్చి కొండపై చెట్టుకు కట్టారు. అలాగే దిగువున ఉన్న రోడ్డులో క్రేన్ నుంచి మరో రోప్‌ను బస్సుకు కట్టారు. లోయలోంచి మెల్లమెల్లగా బస్సును రోడ్డుపైకి చేర్చారు.

ఆర్టీసీ, ఆర్అండ్‌బీ అధికారులు పనులను పర్యవేక్షించారు. బస్సును బయటకు తీసే పనుల వల్ల ట్రాఫిక్ కొంతసేపు నిలిచిపోయింది. ప్రయాణికులు, వాహన చోదకులు అధికార యంత్రాగానికి సహకరించారు. ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు మాత్రం ధ్వంసమైంది. విజయనగరం గ్యారేజ్‌కు తరలించేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

25న ఉపాధి కార్యాలయంలో మెగా జాబ్‌మేళా

కంచరపాలెం (విశాఖ): స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఈ నెల 25న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సీహెచ్ సుబ్బిరెడ్డి (క్లరికల్), కె.శాంతి (టెక్నికల్) తెలిపారు. రక్షిత డ్రగ్స్, ఏడీఎల్ ఆగ్రో ఫార్మా, ఆటోమోటివ్ మ్యానుఫ్యాక్చర్స్, రక్షిత్ ఫార్మాసూటికల్, టీం లీజ్ యూనియన్ బ్యాంక్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో 282 ఉద్యోగ ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ప్రొడక్షన్ ఆపరేటర్, కెమిస్ట్, ప్రొసెస్ డెవలప్‌మెంట్ ల్యాబ్ కెమిస్ట్, ఫిట్టర్స్, కస్టమర్, అండ్ ఫీల్డ్ ట్రైనీ, సేల్స్ డెవలప్‌మెంట్ మేనేజర్, ఫార్మాసిస్ట్, అకౌంటెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్, హార్టీకల్చర్ ఫీల్డ్ ఆఫీసర్, మెకానిక్స్, టెలికాలర్స్, టీం లీడర్స్, అసిస్టెంట్ సేల్స్ మేనేజర్, కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పోస్ట్ గ్యాడ్యుయేట్, ఎంబీఏల్లో ఉత్తీర్ణత సాధించి 18–35 ఏళ్ల కల్గిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఆయా ఉద్యోగాల బట్టి జీతం నెలకు రూ.12 వేలనుంచి రూ.25 వేల వరకు ఉంటుందన్నారు. అభ్యర్థులు ncs.gov.in వెబ్‌సైట్‌లో తమ పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని కోరారు.

రోడ్డుపై విరిగిపడిన చెట్టు కొమ్మ

- నిలిచిన ట్రాఫిక్
- తొలగించిన వాహనచోదకులు, ప్రయాణికులు


చెట్టు కొమ్మను తొలగిస్తున్న వాహనదారులు


నిలిచిపోయిన ట్రాఫిక్‌లో కలెక్టర్ వాహనం

పాడేరు రూరల్ : పాడేరు-చోడవరం ప్రధాన రహదారి ఘాట్‌లోని వ్యూ పాయింట్ మూడో మలుపు వద్ద మంగళవారం సాయంత్రం భారీ చెట్టు కొమ్మ విరిగిపడింది. సాయంత్రం 6గంటల సమయంలో రోడ్డు పక్కనే ఉన్న చెట్టు కొమ్మ రహదారిపై పడిపోయింది. ఈ సమయానికి రెండు నిమిషాల ముందే చోడవరం నుంచి పాడేరు వైపు ఆర్టీసీ బస్సు వెళ్లింది. ఏమాత్రం ఆలస్యమైనా ఆర్టీసీ బస్సుపై పడి ఉండేది. రహదారికి రెండు వైపులా వాహనాలు నిలిచిపోయాయి. విశాఖపట్నం నుంచి పాడేరు వస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ వాహనం పావు గంట సేపు ట్రాఫిక్‌లో చిక్కుకుంది. వాహనదారులు, ప్రయాణికులు కొద్దిసేపు శ్రమించారు. విరిగిపడిన చెట్టు కొమ్మను పూర్తిగా తొలగించడంతో రాకపోకలు ప్రారంభమయ్యాయి.

వరుణుడి కరుణ కోసం ఊరూరా పూజలు


అప్పలరాజుపేటలో పేరంటాలమ్మ చెట్టు వద్ద పూజలు చేస్తున్న రైతులు, మహిళలు

రాజవొమ్మంగి: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వరుణుడి కరుణకోసం గ్రామాల్లో పూజలు నిర్వహిస్తున్నారు. మండలంలోని కొమరాపురంలో కప్పలకు పెళ్లి చేసి వాటిని డోలీలో ఉంచి గ్రామంలో ఊరేగించారు. వాటిని సమీప కొండ వాగులో విడిచి పెట్టారు.

- ముర్లవానిపాలెంలో ఆదివాసీలు గ్రామదేవత గుబ్బల మంగమ్మ తల్లికి పూజలు చేశారు. వరుణుడు కరుణించాలంటూ అమ్మవారిని వేడుకున్నారు.
- అప్పలరాజుపేటలో చల్లని తల్లిగా కొలుస్తున్న పేరంటాలమ్మ తల్లికి సర్పంచ్ చీడి శివ ఆధ్వర్యంలో గిరిజనులు పూజలు చేశారు. అమ్మవారికి కొత్త చీర సమర్పించి అక్కడే వంటలు చేసి నైవేద్యం సమర్పించారు. పసుపు కుంకులతో మహిళలు పూజలు చేశారు.
- రాజవొమ్మంగి గ్రామ శివారు శాంతినగర్‌లో నాయకులు నాగులాపల్లి కుశరాజు, మహిళలు మంగమ్మ, అచ్చమ్మ ఆధ్వర్యంలో ప్రజలు పసుపు నీటిని కడవలతో తీసుకువెళ్లి అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు.

ఆపదలో మేమున్నామని..

- రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి కుటుంబానికి రూ.1.53 లక్షలు అందజేత
- బాసటగా నిలిచిన మారేడుమిల్లి, రంపచోడవరం యూటీఎఫ్ ప్రతినిధులు


ఆర్థికసాయం అందజేస్తున్న యూటీఎఫ్ నేతలు

మారేడుమిల్లి : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉపాధ్యాయుడి కుటుంబానికి మారేడుమిల్లి, రంపచోడవరం యూటీఎఫ్ ప్రతినిధులు బాసటగా నిలిచారు. బాధిత కుటుంబానికి రూ.1.53 లక్షలు అందజేశారు. రంపచోడవరం మండల పెద్దాగెద్దాడ పంచాయతీ చెరువుపాలెం గ్రామానికి చెందిన బోడిక శ్రీనివాసరెడ్డి మండలంలోని గుజ్జుమామిడివలస ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్నారు. ఈ నెల 3న విశాఖలో డిపార్ట్‌మెంట్ పరీక్ష రాసేందుకు స్వగ్రామం నుంచి బైక్‌పై బయలుదేరారు. నక్కపల్లి మండలం ఒడిమెట్ట సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందారు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబానికి మారేడుమిల్లి, రంపచోడవరం మండల యూటీఎఫ్ ప్రధాన కార్యర్శులు కె. కృష్ణారెడ్డి, వెంగళరావు, అధ్యక్షులు డి.మహేష్, సనాతన్ బాబు ఆధ్వర్యంలో మంగళవారం రూ.1.53 లక్షల నగదును బాధిత కుటుంబానికి అందజేశారు. జిల్లా అధ్యక్షుడు విల్సన్, జిల్లా కార్యదర్శి ఆదిరెడ్డి పాల్గొన్నారు.

వేములరాయి రహదారికి గండి


కల్వర్టు వద్ద పడిన భారీ గండి


గొడ్లగూడెం సమీపంలో గోతులు పడిన రహదారి

- భారీ వర్షానికి కోత
- రాకపోకలకు ఇబ్బందులు

చింతూరు: కొద్దిరోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు మండలంలోని కొత్తపల్లి, వేములరాయి గ్రామాల మధ్య రహదారికి గండి పడింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్తపల్లి నుంచి నేలకోట వరకు గతంలో రహదారి నిర్మాణం ప్రారంభించి అసంపూర్తిగా వదిలేశారు. రహదారి నిర్మాణంలో భాగంగా వేములరాయి సమీపంలో కల్వర్టు నిర్మించిన కాంట్రాక్టరు దానికి ఇరువైపులా మట్టిపోసి వదిలేశారు. ఇదే ప్రాంతంలో ఓవైపు కోతకు గురై మట్టి కొట్టుకుపోయింది. దీంతో వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. కల్వర్టు నిర్మాణ సమయంలో ఏర్పాటుచేసిన డైవర్షన్ మార్గంలో వాహన రాకపోకలు సాగిస్తున్నాయి.అయితే ఇదే మార్గంలో వాగు ఉన్నందున వర్షం పడినప్పుడల్లా రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే మార్గంలో గొడ్లగూడెం నుంచి గూడూరు జంక్షన్ వరకు గతంలో నిర్మించిన సిమెంటు రహదారిలో పలు చోట్ల గోతులు ఏర్పడ్డాయి. గూడూరు, కొత్తపల్లి, దేవరపల్లి, వేములరాయి, నేలకోటతో పాటు ఒడిశాకు వెళ్లే ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

పవనగిరిలో నాగపంచమి పూజలు



వల్లీదేవ సేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

అడ్డతీగల: నాగపంచమి పురస్కరించుకుని స్థానిక పవనగిరి క్షేత్రంలోని మానసాదేవి ఆలయంలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివార్లకు సోమవారం ప్రత్యేక పూజాధికాలు నిర్వహించారు. పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకుడు తణుకు వెంకటరామయ్య ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్లకు హరిద్ర కుంకుమ, గంధం విభూది తదితర సుగంధ ద్రవాలతో అభిషేకం చేశారు. నాగపంచమి విశేషాలు వివరించిన అనంతరం ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. నాగపంచమి విశిష్టతను భక్తులకు వివరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

ఏఎంసీ శతాబ్ది ఉత్సవాలకు రండి

కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రికి ఆహ్వానం



కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవియాకు వినతిపత్రం సమర్పిస్తున్న ఏఎంసీ సెంటినరీ సెలబ్రేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ రవిరాజు

మహారాణిపేట : ఆంధ్రా మెడికల్ కాలేజీ(ఏఎంసీ) శతాబ్ది ఉత్సవాలకు హాజరుకావాలని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్సుఖ్ మాండవియాను ఏఎంసీ సెంటినరీ సెలబ్రేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ రవిరాజు కోరారు. ఈ మేరకు సోమవారం ఢిల్లీలోని నార్మన్ భవన్‌లో ఆయన్ని కలిశారు. శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ఏఎంసీ చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. పూర్వ విద్యార్థుల తరపున సుమారు రూ.50 కోట్లతో భవనం నిర్మిస్తున్నట్టు పేర్కొన్నారు. శతాబ్ది ఉత్సవాలకు వస్తానని హామీ ఇచ్చినట్టు రవిరాజు వివరించారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో మహిళా ప్రతినిధి డాక్టర్ టి.రాధ ఉన్నారు.

చురుగ్గా ఓటరు సర్వే

- ఇంటింటా వెరిఫికేషన్ కార్యక్రమం
- ఓటర్ల నమోదుకు కృషి
- గ్రామాల్లో పర్యటిస్తున్న అధికారులు



ఐనాడలో ఇంటింటా ఓటరు సర్వే చేస్తున్న సిబ్బంది

పాడేరు రూరల్ : అల్లూరి సీతారామరాజు జిల్లా వ్యాప్తంగా ఓటర్ల జాబితా ఇంటింటికీ వెళ్లి వెరిఫికేషన్ చేసే కార్యక్రమం పక్కాగా చురుగ్గా సాగుతోంది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బీఎల్‌వోలు, ఇతర సిబ్బంది ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు 49 శాతం వెరిఫికేషన్ పూర్తి చేశారు. జిల్లాలో సుమారుగా 2,87,252 గృహాలు ఉండగా వీరిలో 7,28,80 ఓటర్లకు అందుబాటులో ఉండేందుకు 1008 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఇప్పటికే ఏర్పాటు చేశారు. పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియ సాగుతోంది. ఓటర్ జాబితాలో 18, 19 ఏళ్ళ వయస్సు గల ఓటర్లు మూడు శాతం ఉండాల్సి ఉండగా ప్రస్తుతానికి 1.25 శాతం ఓటర్లను నమోదు చేశారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్న విద్యార్థును ఖచ్చితంగా ఓటర్ జాబితాలో చేర్చాకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో వారిపై ప్రత్యేక దృష్టి పెట్టి ఓటర్లను కూడా నమోదు చేయిస్తున్నారు. ఓటర్ల నమోదుకు వీహెచ్‌ఎల్ యాప్‌తో పాటు నేషనల్ ఓటర్ సర్వీస్ పోర్టల్ వెబ్‌సైట్‌ను వినియోగిస్తున్నారు. ఇంటింటా వెరిఫికేషన్ కోసం ఇళ్ల వద్దకు వచ్చే బీఎల్‌వోలకు లేదా నేరుగా తహసీల్దార్‌లకు ఫారం -6 కొత్త ఓటర్లు అందజేస్తుండగా వాటిని ఈఆర్‌వో నెట్‌లో నమోదు చేస్తున్నారు.

ఎపిక్ కార్డుల పంపిణీ

జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు కొత్తగా 12,364 మంది ఓటర్లను నమోదు చేస్తున్నారు. కొత్తగా ఓటర్‌గా నమోదైన వారికి పోస్ట్ ద్వారా వారి ఇళ్లకు ఎపిక్ కార్డులు పంపిణీ చేస్తున్నారు. ఎపిక్ కార్డు బాగోలేకపోయిన, పేరు, ఫోటో తప్పులున్నా ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. మైగ్రేషన్ ఓటర్ల విషయంలో పూర్తిగా పరిశీలించి, నిర్ధారించిన తర్వాతే తొలగింపు చర్యలు చేపడుతున్నారు. ఒక నియోజకవర్గం నుంచి వేరేక నియోజకవర్గానికి లేక వేరే పోలింగ్ బూత్‌కు ఓటర్ తన ఓటును మార్చుకోవాల్సి వస్తే ఫారం-8 ద్వారా సరైన ధ్రువీకరణ పత్రాలు తీసుకున్న తర్వాతే మార్పులు, చేర్పులు చేస్తున్నారు.

తొలగింపు ప్రక్రియ

ఓటరగా ఉన్నవారు మరణించిన , డూప్లికేట్ ఓటర్ అయిన, శాశ్వతంగా వేరే చోటుకు వెళ్లినా ఓటర్ల విషయంలో సమగ్ర విచారణ జరిపి పూర్తి ఆధారాలతో ఫారం-7ద్వారా తొలగింపు ప్రక్రియ చేపడుతున్నారు. ఓటర్ల జాబితాలో మృతి చెందిన వ్యక్తులను గుర్తించి నిబంధనల ప్రకారం ఫారం-7 ద్వారా మరణ ధ్రువీకరణ పత్రం సేకరించి తప్పనిసరిగా నోటీసు ఇచ్చిన తర్వాత మాత్రమే తొలగిస్తున్నారు.

జీరో నంబర్ గృహాల గుర్తింపు-సవరణ

జీరో డోర్ నంబర్, ఒకే డోర్ నంబర్‌లో పది కన్నా ఎక్కువగా ఉన్న ఓటర్లు , తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి ఇంటి పన్ను రశీదు ఆధారంగా వాస్తవ పరిస్థితులను గుర్తిస్తున్నారు, జిల్లాలో 13,269 జీరో నంబర్ ఇళ్లు ఉండగా ఇప్పటికే ఇంటింటా వెరిఫికేషన్ ద్వారా 7,903 ఇళ్ల నంబర్లను సవరించారు. 65 జంక్ క్యారెక్టర్ నంబర్లు ఉండగా ఇప్పటికి ఐదు ఇళ్లను సవరించారు. ఒకే ఇంట్లో పది మంది కన్నా ఎక్కువ మంది ఓటర్లు ఉన్నా 3,645 ఇళ్లకు గాను ఇప్పటికి 2,541 గృహాలకు సవరణలు చేశారు.

పీవీటీజీ ఓటర్లపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో ఉన్న పీవీటీజీ ఓటర్ల నమోదులో ప్రత్యేక దృష్టి సారించి 18ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరికి ఓటర్‌గా నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశాల మేరకు గత మూడు నెలల్లోనే ఏకంగా 18వేల మంది పీవీటీజీలను ఓటర్లుగా నమోదు చేశారు. జిల్లా వ్యాప్తంగా 2.33 మంది పీవీటీసీ జనాభా ఉండగా వీరిలో 1.52లక్షల మంది 18ఏళ్లకు పైబడిన వారు ఉన్నారు. వీరిలో 1.34 లక్షల మందిని ఓటర్లుగా నమోదై ఉన్నారు. మరో 18వేల మందిని కూడా ఓటర్లుగా నమోదు చేసే ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది.

పక్కాగా పరిశీలన ప్రక్రియ

జిల్లా వ్యాప్తంగా ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియ పక్కాగా సాగుతోంది. బీఎల్‌వోలు ఇంటింటా సందర్శిస్తున్నారు. సర్వే చేపట్టి ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను నిర్వహిస్తున్నాం. రాజకీయ పార్టీలు కూడా తమ ప్రతినిధుల ద్వారా వారి తరపున నియమించిన బూత్ ఏజెంట్లను కూడా సర్వే జరుగుతున్నప్పుడు బీఎల్‌వోలతో పంపించి సహకరించారు. ప్రజలు ఇంటింటా సర్వేకు వచ్చే సిబ్బందికి సహకరించి సమగ్ర వివరాలు అందించాలి. 18 ఏళ్లు నిండిన యువత కొత్త ఓటర్‌గా నమోదు అయ్యేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలి.



– జె. శివ శ్రీనివాస్, జాయింట్ కలెక్టర్, పాడేరు

ఖాళీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఐటీడీఏ ఏపీవో జనరల్ శ్రీనివాసరావు

రంపచోడవరం: అడ్డతీగల మండలం పింజరకొండ జలవిద్యుత్తు కేంద్రంలో పది ఖాళీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించామని రంపచోడవరం ఐటీడీఏ ఏపీవో జనరల్ సిహెచ్ శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. నాలుగు ప్లాంటు ఆపరేటర్ పోస్టులకు, 4 హెల్పర్ పోస్టులకు, 2 వాచ్‌మెన్ పోస్టులకు మొత్తం 217 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిలో 34 దరఖాస్తులు ఇతర కారణాలతో తిరస్కరించామన్నారు. 183 దరఖాస్తులను పరిగణలోనికి తీసుకుని గిరిజన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు తెలిపారు. ఏపీ ట్రిప్‌కో డిప్యూటీ జనరల్ మేనేజర్ అంకిరెడ్డి, డీడీ జాన్ రాజ్, ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎండీ యూసఫ్, డీఈ ఏ వెంకటేశ్వరరావులతో కూడిన బృందం ఇంటర్వ్యూలు నిర్వహించిందన్నారు.

స్పెషల్ బార్ మిల్ రికార్డ్ ఉత్పత్తి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ స్పెషల్ బార్ మిల్ (ఎస్‌బీఎం) ఆదివారం రికార్డు ఉత్పత్తి సాధించింది. రాత్రి షిఫ్ట్‌లో 794 టన్నులు ఉత్పత్తి చేయడం ద్వారా గతంలో చేసిన ఉత్పత్తి రికార్డును అధిగమించారు. రికార్డు ఉత్పత్తి సాధించిన స్పెషల్ బార్ ఉద్యోగులను, కాంట్రాక్ట్ కార్మికులను స్టీల్ వైఎస్సార్‌టీయూసీ నాయకులు అభినందించారు.

వారియర్స్ సూపర్ విజయం

- సీజన్‌లో తొలిసారిగా సూపర్ ఓవర్
- వైజాగ్ వారియర్స్‌ను వరించిన విజయం



అర్ధసెంచరీ భాగస్వామ్యాన్నందించిన టైగర్స్ కెప్టెన్ రికీతో మహీప్

విశాఖ స్పోర్ట్స్: ఏపీఎల్ రెండో సీజన్‌లో రాయలసీమ కింగ్స్, వైజాగ్ వారియర్స్ జట్ల మధ్య మ్యాచ్ టైగా ముగిసింది. సూపర్ ఓవర్‌లో వైజాగ్ వారియర్స్‌ను విజయం వరించింది. వైఎస్సార్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన వైజాగ్ వారియర్స్ 171 పరుగులు చేసింది. ఓపెనర్ అర్జున్ 30, ప్రశాంత్ కుమార్ 73, కెఎస్ఎన్ రాజు(8), కెప్టెన్ కరణ్ షిండే(8), ధ్రువ్ కుమార్ 24, తరుణ్ 15 పరుగులు చేశారు. కమరుద్దీన్ నాలుగు వికెట్లు తీయగా హరిశంకర్, అఖిల్, సాకేత్ ఒకో వికెట్ తీశారు. ప్రతిగా రాయలసీమ కింగ్స్ ఓపెనర్లు కెప్టెన్ హనుమ విహారి 71, అభిషేక్ 58 పరుగులు చేశారు. వీరి జోడి తొలి వికెట్‌కు ఏకంగా 105 పరుగుల భాగస్వామ్యాన్నందించింది. వీరారెడ్డి 6, గిరినాథ్ 12 వంశీకృష్ణ 13 పరుగులు చేశారు. రాయలసీమ కింగ్స్ చివరికి ఆరువికెట్లకు 171 పరుగులకే ముగించడంతో మ్యాచ్ టైగా ముగిసింది. కార్తీక్ రామన్ రెండు, గిరీష్‌కుమార్, సిద్దార్థ చెరో వికెట్ తీశారు.

సూపర్ ఓవర్

రాయలసీమ కింగ్స్ మూడు బంతుల్లో ఒక పరుగుకు రెండు వికెట్లు కోల్పోగా వైజాగ్ వారియర్స్ రెండు పరుగులు చేసి విజయం సాధించింది. దీంతో కింగ్స్ విజయ పరంపరకు వారియర్స్ అడ్డుతగిలింది. వారియర్స్‌కు నాలుగు మ్యాచ్‌ల్లో ఇదే తొలివిజయం.

లయన్స్‌ను నిలువరించిన టైగర్స్

ఏపీఎల్-2లో భాగంగా వైఎస్ఆర్ స్టేడియంలో సోమవారం జరిగిన పోటీలో ఉత్తరాంధ్ర లయన్స్‌ను బెజవాడ టైగర్స్ నిలువరించాయి. లయన్స్‌పై ఏడు వికెట్ల తేడాతో టైగర్స్ విజయం సాధించింది. తొలి మూడు మ్యాచ్‌ల్లో ఓడిన టైగర్స్ ఈ మ్యాచ్‌లో విజయంతో ప్లేఆఫ్ ఆశల్ని సజీవంగా ఉంచుకుంది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఉత్తరాంధ్ర లయన్స్ నాలుగు వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేసింది. ఓపెనర్ గుల్ఫామ్ పరుగుల ఖాతా తెరవకుండానే ఔట్ కాగా మరో ఓపెనర్ కెప్టెన్ భరత్ 25 పరుగులు చేశాడు. రాహుల్ 41, తపస్వి 28, శ్యామ్ సుందర్ 45, శ్రీనివాస్ 16 పరుగులు చేశారు. సంతోష్, షోయబ్, లలిత్, అఖిల్ తలో వికెట్ తీశారు. ప్రతిగా బెజవాడ టైగర్స్ 18.4 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి విజయలక్ష్యాన్నందుకుంది. ఓపెనర్ అభినవ్(8), మనీష్(17), కెప్టెన్ రికీబుయ్ 41, మహీప్‌కుమార్ 77, షోయబ్ 15 పరుగులు చేశారు. పృథ్వీ, తేజస్వి రఫీ ఒకో వికెట్ తీశారు.



లాంగ్ ఆఫ్ మీదుగా బంతిని తరలించబోయి రవికిరణ్‌కు క్యాచ్ ఇచ్చిన కింగ్స్ కెప్టెన్ విహారి

గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం



వంట్లమామిడిలో గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి
- వంట్లమామిడిలో గ్రామ సచివాలయం ప్రారంభం

పాడేరు రూరల్ : గ్రామ సచివాలయల ఏర్పాటుతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని గ్రామ స్వరాజ్యం స్థాపించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని వంట్లమామిడి గ్రామ సచివాలయంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని సోమవారం ఆమె ప్రారంబించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు పాలన మరింత చేరువైందన్నారు. గ్రామాల్లో నెలకొన్న ఏ సమస్యకైన గ్రామ సచివాలయాలే కేరాఫ్ అడ్రస్‌గా మారిందన్నారు. అవినీతి రహిత పారదర్శక పాలన గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు అందుతోందన్నారు. ఇలాంటి అద్భుతమైన గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రజలంతా రుణపడి ఉండాలని వచ్చే ఎన్నికల్లో కూడా వైఎస్సార్‌సీపీకి ప్రజా మద్దతు తెలపాలని కోరారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, గ్రామ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ స్పందనకు 51 అర్జీలు

- భూ పట్టాల రీ సర్వేకు వినతులు
- రేషన్ కార్డులకోసం దరఖాస్తులు

దేవీపట్నం: ఏజెన్సీలోని వివిధ గ్రామాలకు చెందిన గిరిజనుల నుంచి రంపచోడవరం ఐటీడీఏ ఏపీవో సీహెచ్ శ్రీనివాసరావు స్పందన కార్యక్రమంలో అర్జీలు స్వీకరించారు. ఐటీడీఏ సమావేశపు మందిరంలో సోమవారం స్పందన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 51 అర్జీలు వచ్చినట్లు ఏపీవో తెలిపారు. వై.రామవరం మండలం చింతలపూడి పంచాయతీలోని 13 గ్రామాల గిరిజనులకు సంబంధించిన జాయింట్ భూమి పట్టాలను రీసర్వే చేసి విడదీసి కొత్త పట్టాలు మంజూరు చేయాలని ఉప సర్పంచ్ పల్లాల లచ్చిరెడ్డి, ముర్ల జోగి రెడ్డి కోరారు. గంగవరం మండలం ఏటిపల్లి గ్రామంలో తమ భూ సమస్య పరిష్కరించాలని ముర్ల బాలమ్మ దరఖాస్తు సమర్పించారు. దేవీప్నటం మండలం పోలవరం ప్రాజెక్టు ముంపునకు గురైన పి.గొందూరు ఆర్‌అండ్ఆర్ కాలనీలకు కరెంటు మీటర్లు ఏర్పాటు చేయాలని పూడిపల్లి పంచాయతీ సర్పంచ్ కలుం నరసయమ్మ, కొమరం వీరమణి, కలుం శ్రీనివాస్‌దొర ఫిర్యాదు అందజేశారు. అడ్డతీగల, రాజవొమ్మంగి మండలాల్లో కొందు కులానికి సంబంధించిన గిరిజనులకు రేషన్ కార్డులు మంజూరు చేయాలని, భూ సమస్య పరిష్కరించాలని కిలో సత్తిబాబు. కె.గణేశ్వరరావు, నాగులపల్లి అర్జునరావు డిమాండ్ చేశారు. గిరిజనులతో కలిసి ఐటీడీఏ ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం ఏపీవోకు అర్జీ అందజేశారు. రంపచోడవరం మండలం వేములకొండ పంచాయతీలో ఇల్లు లేని గిరిజనులకు వాటిని మంజూరు చేయాలని, అదేవిధంగా వెట్టిచెలకల గ్రామ పాఠశాలలో విద్యార్థులు ఎక్కువగా ఉన్నారని, మరొక ఉపాధ్యాయుడిని నియమించాలని సర్పంచ్ కొమరం పండుదొర, ఎంపీటీసీ నర్రి పాపారావు కోరారు.

జిల్లాలో ఎక్కువగా బాల్య వివాహాలు

- ఆ వివాహానికి వెళ్లిన వారు, పూజారి నేరస్తులే..
- బాలల హక్కుల కమిషన్ సభ్యుడు సీతారాం



కేజీబీవీలో బాలికలతో మాట్లాడుతున్న సీతారాం, పక్కన అధికారులు

కొయ్యూరు: అల్లూరి జిల్లాలో ఎక్కువగా బాల్య వివాహాలు చేస్తున్నారని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు జి. సీతారాం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బాల్య వివాహం అంటే రెండు వైపులా తల్లిదండ్రులు మాత్రమే కాదని, అర్చకులు సహా హాజరైన వారంతా నేరస్తులవుతారని తెలిపారు. కొయ్యూరు మండలంలోనే ఏటా 328 వరకు బాల్య వివాహాలు చేస్తున్నట్టుగా తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇక మీదట వాటి నిర్మూలనకు వీలుగా ప్రభుత్వం సచివాలయాల పరిధిలో వివాహ ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేందుకు యోచిస్తుందన్నారు.

కేజీబీవీ నిర్వహణపై తీవ్ర అసంతృప్తి..

ముందుగా రాజేంద్రపాలెం కేజీబీవీని సందర్శించారు. అక్కడ పూర్వ ఎస్‌వో శాంతి రాత్రిళ్లు తన ఇంటికి విద్యార్థినులను తీసుకెళ్లడంపై తీవ్ర అసంతృప్తి చెందారు. దీనిపై చర్యలకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామన్నారు. ఇక్కడ బాలికలకు ఆహారం సరిగా పెట్టకుండా బియ్యం, ఇతర పదార్థాలను ఆటోల్లో తరలించడం తగదని హెచ్చరించారు. కాకరపాడు గురుకుల జూనియర్ కళాశాలలో మెనూ అధ్వానంగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై డీడీకి నివేదిస్తామన్నారు. స్థానిక ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. బాలల హక్కుల జిల్లా కమిషన్ సభ్యులు లవకుశ, ఏజీసీడీవో సూర్యకుమారి, సర్వశిక్ష అభియాన్ ఏపీసీ శ్రీనివాసరావు, బాలల హక్కుల రక్షణ సభ్యులు అచ్యుత్, విజయకుమార్, సాగర్, ప్రసన్న, వెంకయమ్మ, ఎంపీపీ బడుగు రమేష్‌బాబు, ఎంపీడీవో లాలం సీతయ్య, పూర్వ సీడీపీవో రమణి, ఎంపీవో బోడంనాయుడు, జేఈలు రామకృష్ణ, విశ్వతేజ, మంప ఎస్ఐ లోకేష్ కుమార్, ఈవోపీఆర్డీ నాయుడు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం





తహసీల్దార్ సత్యనారాయణ, ఎస్ఐ నాగార్జునను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

దేవీపట్నం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ సేవా పురస్కారాలు పొందిన అధికారులను మండల వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. తహసీల్దార్ సత్యనారాయణ, ఎస్ఐ నాగార్జున కలెక్టర్ , ఎస్పీల చేతుల మీదుగా ఇటీవల పాడేరులో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల్లో అవార్డు స్వీకరించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సోమవారం ఎంపీపీ కుంజం మురళి, మండల సచివాలయ కన్వీనర్ కందుల బాబ్జి, కట్టా సత్యనారాయణ(సత్తిబాబు), పెద్దబ్బాయిదొరలు వారిని శాలువా కప్పి సన్మానించారు.



పాడేరు ఆస్పత్రిలో ప్రమాద బాధితులను పరామర్శిస్తున్న రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షురాలు డాక్టర్ వెంకటలక్ష్మి



విశాఖలోని మెడికవర్‌లో ఆస్పత్రిలో ప్రమాద బాధితురాలిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి బాలరాజు

ఘర్షణలో ఒకరికి గాయాలు

దేవీపట్నం: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ఇద్దరు వ్యక్తుల మధ్య ఘర్షణ చోటుచేసుకోవడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలవరం ప్రాజెక్టు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంగుళూరు సైట్ వద్ద సోమవారం జరిగిన సంఘటనలో ఇతర రాష్ట్రాలకు చెందిన ఇరువురు కార్మికులు మధ్య ఘర్షణ చోటుచేసుకోవడంతో సూర్యపురుషోత్తం అనే వ్యక్తి నవిలేష్‌కుమార్ అనే వ్యక్తిని చాకుతో దాడిచేసి గాయపరిచాడు. బాధితుడిని రాజమండ్రి జీజీహెచ్‌కు తరలించారు. పనిలో భాగంగా వారి మధ్య వాగ్వాదం జరగడంతో దాడికి పాల్పడినట్టు పలువురు చెబుతున్నారు. దీనిపై ఎస్ఐ కె.వి.నాగార్జున కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

దువ్వాడ వీఎస్ఈజెడ్ రికార్డు స్థాయి ఎగుమతులు

అగనంపూడి : దువ్వాడ వీఎస్ఈజెడ్ పరిధిలోని తెలుగు రాష్ట్రాల్లోని సెజ్‌లు, యూనిట్ల ద్వారా రికార్డు స్థాయి ఎగుమతులు సాధించినట్టు వీఎస్ఈజెడ్ జోనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ ముప్పాల శ్రీనివాస్ తెలిపారు. మొదటి త్రైమాసికం (ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు)లో రూ.50,195 కోట్ల విలువైన వస్తువులు, సేవలను ఎగుమతులు చేసినట్టు పేర్కొన్నారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది 34 శాతం వృద్ధి రేటు సాధించినట్టు చెప్పారు. వివిధ వస్తువులను ఉత్పత్తి చేయడం ద్వారా రూ.35,992 కోట్లు, సేవలను ఎగుమతులు చేయడం ద్వారా రూ.14,203 కోట్లు మేరకు విదేశీ మారకద్రవ్యం లభ్యమైనట్టు తెలిపారు.